ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు



సుల్తానాబాద్: ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు.. గుండెల్లో గుబులు.. డిమాండ్‌కనుగుణంగా ఉత్పత్తి, దిగుమతి లేకపోవడానికి తోడు అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. వారం, 10 రోజుల వ్యవధిలోనే ధరలు ఎగబాకడంతో ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది. వారం రోజుల క్రితం రూ.200కు వచ్చిన సరకులు.. ఇప్పుడు రూ.600 పట్టుకెళ్లినా రావడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలోని మార్కెట్లలో ఆకాశాన్నంటిన ధరలు చూసి ప్రజలు బేజారెత్తిపోతున్నారు.

కారణమిదే..

జిల్లాలో కూరగాయల సాగు నామమాత్రంగా ఉంటోంది. రైతులు వేసవిలో బెండకాయ, వంకాయ మాత్రమే పండించారు. వర్షాకాలం భానుడు నిప్పులు చెరగడంతో వీటి దిగుబడి పెద్దగా రాలేదు. దీంతో ఇవి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. టమాట, కాకరకాయ, బీరకాయ, చిక్కుడు, దోసకాయ, కాకరకాయ, దొండకాయ, ఆలుగడ్డలు, క్యాబేజీ, క్యారెట్ దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావడానికి రవాణా వ్యయం అధికమవుతోంది. సరఫరాలో జాప్యం జరిగితే ఇవి వాడిపోతుండడంతో ఆ నష్టంతోపాటు దళారుల బెడద కూడా వినియోగదారుడిపైనే పడుతోంది. స్థానికంగా కూరగాయల లభ్యత పెరిగితే తప్పా.. ధరలకు కళ్లెం వేయలేమని వ్యాపారులంటున్నారు.

దిగుమతి చేసుకోవాల్సిందే..

కాకరకాయలు ఒంటిమామిడి, టమాట మదనపల్లి, నిజామాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. క్యాప్సికం, బీన్స్ బెంగళూరు నుంచి వస్తుంది. బోయినపల్లి నుంచి కాలీఫ్లవర్, క్యాబేజీ, బీట్‌రూట్, కీరా దిగుమతవుతోంది. క్యారెట్ హైదరాబాద్ నుంచి, చామగడ్డ సికింద్రాబాద్ నుంచి తీసుకొస్తున్నారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి

మొన్నటిదాక కిలో రూ.30 పలికిన పచ్చి మిర్చి.. ఇప్పుడు రూ.80. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాకు చేరేసరికి రవాణా చార్జీలు కలిపి ధర మూడింతలు పెరిగింది. టమాట రూ.40 పలుకుతోంది. కాకరకాయ రూ.60. బెండకాయ రూ.60, దొండకాయ రూ.70, దోసకాయ రూ.40, క్యారెట్ రూ.80 ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోక తప్పడం లేదు. దీని ప్రభావం ధరలపై కనిపిస్తోంది.

సంచి నిండుతలేదు



కూరగాయల మార్కెట్‌కు రూ. 500 తీసుకెళ్లినా సంచి నిండడం లేదు. నిత్యం వంటలకు పచ్చి మిర్చి అవసరం. కొత్తిమీర, టమాటా మెజార్టీ వంటల్లో వేయడం ఆనవాయితీ. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కూరగాయలు పెనుభారమే అయ్యింది.
– స్వాతి, గృహిణి, సుల్తానాబాద్

ధరలు నియంత్రించాలి



ధరలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మధ్య దళారులు అధికంగా ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నా.. అధికారులు చూసీచూడనట్లు ఉండడంతో ధరలు పెరుగుతున్నాయి. మార్కెట్ అధికారులతోపాటు తూనికల కొలతల అధికారులు మార్కెట్లో విచారణ చేస్తే ధరలు తగ్గే అవకాశముంది.
– వీరగోని సుజాతగౌడ్, గర్రెపల్లి

క్లుప్తంగా

పురాతన భవనం తొలగింపు



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న పురాతన భవనాన్ని సోమవారం తొలగించారు. పాఠశాల ఆరంభంలో నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సాక్షి దిన పత్రికలో కొద్ది రోజుల క్రితం పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా మారిన శిథిల భవనం అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖ ఆదేశాల మేరకు నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది.

ఆర్‌ఎస్‌బీ కాలువలో పూడికతీత



కమాన్‌పూర్: గుండారం రిజర్వాయర్ నుంచి సాగునీరందించే ఆర్‌ఎస్‌బీ కాలువలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. గుండారం రిజర్వాయర్ నుంచి రామగిరి మండలం బేగంపేట వరకు కాలువలో పూడికతోపాటు చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించేందుకు నీటిపారుదల శాఖ రూ.35లక్షలు నిధులు మంజూరు చేసిందని, పనులు చేపడుతున్నట్లు డీఈ రాజేందర్ తెలిపారు.

అవార్డు అందజేత



సుల్తానాబాద్: పట్టణానికి చెందిన ఏగోలపు సదయ్యగౌడ్‌కు ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డును మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కొమ్ము ప్రవీణ్‌కుమార్ అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆగం నాగేంద్రయాదవ్-రామ్స్ ప్లాజలో హూలీ ప్రిన్స్ ఫౌండేషన్-కేబీఎస్ మాతృదేవోభవ చారిటబల్ ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఏగోలపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 21 ఏళ్లుగా చేస్తున్న సేవాకార్యక్రమాలను గుర్తించి అవార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఏపీపీకి సన్మానం



సన్మానం చేసిన న్యాయవాదులు

గోదావరిఖనిటౌన్: అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నూతనంగా నియమితులైన చెలికల పద్మజను స్థానిక ఆధ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం న్యాయవాదులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సీనియర్ న్యాయవాది గుడికందుల భూమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ పెద్దెల్లి ప్రకాశ్, న్యాయవాదులు కాదాశి శేఖర్, సౌభాగ్య, గాదె శ్రీలత, రజిత, కిరణ్‌కుమార్, వేణు, శానవాజ్ హరీశ్, పెంట రవికుమార్, సరిత, నాగరాజు, రమేశ్, రాజు, హేమ, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి..



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వికలాంగులు

ధర్మారం: పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వికలాంగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనగంటి గంగయ్య, అధ్యక్షుడు గుమ్మడి రమేశ్, ఉపాధ్యక్షుడు దారవేణి అంజయ్య, నాయకులు కందుకూరి విశ్వరూపచారి, కనకయ్య, గుర్రాల రాజేశం, జాడి స్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి దుకాణంలో మంటలు

గోదావరిఖనిటౌన్: లక్ష్మీనగర్‌లోని దుర్గాభవాని పూజా సామగ్రి దుకాణంలో మంటలు చెలరేగి కొంత సామగ్రి కాలిపోగా.. స్థానికులు మంటలార్పినట్టు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సుభాష్‌నగర్‌కు చెందిన బోయిని జశ్వంత్ రోడ్డు దాటుతుండగా.. పెద్దపల్లి వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. సమాచారమందుకున్న ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ పోలీసులు తీవ్ర గాయాలైన జశ్వంత్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



రామగుండం: పూర్వ విద్యార్థులు



ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్‌లో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామగుండం: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ 1996–97 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఎన్టీపీసీలోని రాజన్ టవర్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మొదట సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో కలుసుకొని రాజన్ టవర్స్‌లో సమావేశం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు నోయల్ జోసెఫ్, ఆశ జోసెఫ్, శారద, శాస్త్రి, శ్రీనివాస్, రోహిణి, రాజిరెడ్డి, మంజుల, సురేశ్‌ను సన్మానించారు.

ఎలిగేడు: ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుకున్న 1994–95 పదోతరగతి విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. గురువులు హెచ్‌ఎం మధుసూదన్‌రావు, పదాల శంకరయ్య, సత్యనారాయణ, రాజయ్య, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, లక్ష్మీనారాయణ, దేవయ్య, దత్తాత్రేయను సత్కరించారు.



పెద్దపల్లిలోని కళాశాలలో..



బోనాలతో వెళ్తున్న శారద, మహిళలు

బోనాల ఉత్సవాలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం గోరింటాకు సంబరాలు, బోనాల వేడుకలను జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో తెలంగాణ సంప్రదాయాలకనుగుణంగా ఈ పండుగ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితని కరస్పాండెంట్ రజని, శ్రీనివాస్ అన్నారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో అలరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వచర్లలో..

రామగిరి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కల్వచర్ల గ్రామంలో సోమవారం ఆర్‌ఎస్‌కే ఆపన్నహస్తం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం రేండ్ల శారద బోనం ఎత్తుకొని ముందుగా బోడ్రాయి దగ్గర మొక్కులు చెల్లించారు. పెద్ద పోచమ్మ ఆలయానికి ర్యాలీగా చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి ఓడి బియ్యం చెల్లించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గోరింటాకు ఉత్సవంలో మార్కెట్ చైర్‌పర్సన్, మాజీ ఎంపీపీ తదితరులు



వాసవి మాత ఆలయంలో..

గోరింటాకు వేడుకలు

పెద్దపల్లిరూరల్: రంగంపల్లిలో సోమవారం గోరింటాకు, గాజుల ఉత్సవాన్ని జరుపుకున్నారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మాజీ ఎంపీపీ సందనవేన సునీత, మాజీ కౌన్సిలర్ గాదె మాధవి, సహజ కవయిత్రి బొమ్మిదేని రాజేశ్వరి, కటికనపల్లి స్వరూప తదితరులు పాల్గొని ఆషాఢ మాసంలో గోరింటాకు ప్రత్యేకతను గుర్తు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ పూదరి మహేందర్, రవికుమార్, అమిరిశెట్టి సతీశ్, వెంకన్న తదితరులున్నారు.

ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో..

కాల్వశ్రీరాంపూర్: ఆషాఢ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో సోమవారం ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో మాలలు వేసి వాసవి పారాయణం చేశారు. ఒక్కో ఇంటి నుంచి వివిధ రకాల పిండి వంటలు, తీపి పదార్థాలను స్వయంగా వండి తెచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చకుడు అంబరీశ్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. సంఘం నాయకులున్నారు.

ఆధ్యాత్మికం

బిల్వార్చన



శివుడికి బిల్వార్చన చేస్తున్న భక్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామ శ్రీచిలుకల రామేశ్వరాలయంలో ఆషాఢ మాసం చివరి సోమవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని స్థానిక రైల్వే స్టేషన్‌కు చెందిన ఇల్లందుల రాజమౌళి కుటుంబం శివుడికి రుద్రాభిషేకం, 51వేల బిల్వ పత్రాలతో బిల్వార్చన పూజలు చేశారు. రామగుండం ఆర్యవైశ్య కుటుంబాలు హాజరై భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

రుద్రాభిషేకం



భక్తులకు అన్న ప్రసాద వితరణ

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం చేశారు. భక్తులకు దాతలు అన్న ప్రసాద వితరణ చేశారు. పొట్టాల మల్లేశం, పాటకుల అనిల్, బెజ్జంకి రమేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ కమిటీ అధ్యక్షుడిగా చంద్రయ్య

ధర్మారం: దొంగతుర్తి గ్రామంలో మహాలక్ష్మి, భూలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ చొప్పరి చంద్రయ్యను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు సమావేశమయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, సముద్రాల అశోక్‌రావు, అలువాల రాజేశం, ముత్యాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా జుంజిపెల్లి రమేశ్, తమ్మడవేని రవీందర్, బాలసాని లింగయ్య, వెన్నం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా పెర్క బానేశ్, జుంజిపెల్లి దిలీప్, కోశాధికారిగా అనుమాల సాగర్, కార్యదర్శులుగా ఎలిగేటి రమేశ్, పల్లపు ప్రసాద్, కుంభం లక్ష్మణ్, సభ్యులు ఎన్నికయ్యారు.

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా శ్యాంప్రసాద్

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని మేదరి సంఘం ఆధ్వర్యంలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా రెడ్డి శ్యాంప్రసాద్, డిప్యూటీ చైర్మన్‌గా శనిగరపు మల్లేశ్, ఇన్‌చార్జిలు, ఆర్గనైజర్లను ఎన్నుకున్నారు.



జ్యోతినగర్: సండే మార్కెట్‌లో అందరికీ ఉపయోగపడే బోరు బావి కొద్ది నెలలుగా పని చేయక బోసిబోయింది. దీంతో మార్కెట్‌కు వచ్చిన వారు నీటిని వాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం సండే మార్కెట్‌లో కూరగాయలు, వివిధ వ్యాపారాలు చేసుకునేవారికి బోరు బావి నీరు ఎంతగానో ఉపయోగపడేది. పని చేయకపోవడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నారు. మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని అమ్మకందారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కనకదుర్గ దేవాలయంలో పూజలు



పూజలు చేసిన ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ దంపతులు

గోదావరిఖని: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని జీడీకే–11 గనిపై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయంలో సోమవారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. గని ఏజెంట్ చిలక శ్రీనివాస్, గని మేనేజర్ బి.మల్లేశం పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం



రాములు(ఫైల్)

గోదావరిఖని: స్థానిక కాకతీయ నగర్‌కు చెందిన సింగరేణి మాజీ కార్మికుడు కనకం రాములు(70) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్జీ–2 పరిధిలోని జీడీకే–7 ఎల్‌ఈపీ గనిలో పని చేసి రిటైరైన రాములు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తన ఉద్యోగ విరమణ తర్వాత మూడో కూతురి భర్తకు తన ఉద్యోగం పెట్టించాడు. కొన్నాళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఏడాది క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ కూడా అయ్యింది. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నాడు. అతడి భార్య చిన్న కూతురి ఇంటికి వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. భార్య భూమమ్మ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ అనూష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాములుకు నలుగురు కూతుళ్లున్నారు.

నేత్రాలు సజీవం..

రాములు నేత్రాలను దానం చేసేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రాములు నేత్రాలను టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు.

రేపు విద్యాసంస్థల బంద్ పాటించండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న విద్యాసంస్థల బంద్ పాటిస్తున్నట్లు నాయకులు సందీప్, ప్రశాంత్, ప్రీతం, సాయిరాం పేర్కొన్నారు. పెద్దపల్లిలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌కు పాఠశాల యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలన్నారు. మామిడిపల్లి అరవింద్, సాయి, మధుకర్, నితిన్, వినయ్, రాజు, ప్రణయ్, హరీశ్ తదితరులున్నారు.

పరామర్శ



ఏసీపీ కృష్ణను పరామర్శిస్తున్న ఆర్డీవో, మాజీ ఎమ్మెల్యే తదితరులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తండ్రి ఐలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఆర్డీవో గంగయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి పరామర్శించారు. నాయకులు అశోక్‌రావు, మహేందర్, తిరుపతి, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శ్రీనివాస్(ఫైల్)

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన అయిలు శ్రీనివాస్(48) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ కథనం ప్రకారం.. శ్రీనివాస్ కొంత కాలంగా పేగులో నొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు రవితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో ఒప్పుకున్నారు. ఎల్వీపీ రాజేంద్రప్రసాద్ సహకారంతో సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంకుకు తరలించారు.



రహదారి గుంతలమయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ లక్ష్మీపురం కొత్త గేట్ నుంచి యైటింక్లయిన్‌కాలనీ వైపుగా 10 గ్రామలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు వర్షపు నీటితో నిండి ప్రమాదాలకు నిలయంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఆటోలు, పాఠశాల బస్సులు, బాటసారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులకు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయంతో వణకాల్సిన పరిస్థితి. రోడ్డుపై గుంతలు ఏర్పడడం, వీధి దీపాలు లేకపోవడంతో ప్రయాణమంటేనే జంకుతున్నారు.